జమలాపురం ఆలయ హుండీ లెక్కింపు

లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, డిసెంబర్ 27 : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కే.జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో 92 రోజులకు గాను భక్తులు సమర్పించిన హుండీల లెక్కింపు నిర్వహించగా రూ.36,55,896 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దేవాదయ శాఖ పరిశీలకులు ఆర్.సమత పర్యవేక్షించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి, డిసెంబర్27 : రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ మండల నాయకుడు వంకాయలపాటి వెంకటేశ్వరరావు కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వంకాయలపాటి పవన్‌కుమార్ ఉన్నారు.

సత్తుపల్లి కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బోయినపల్లి

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 27 : సత్తుపల్లి 6వ అదనపు కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బోయినపల్లి రవి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆరవ అదనపు జిల్లా కోర్టు సత్తుపల్లిలో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బోయినపల్లి రవి ఉద్యోగోన్నతి పొంది చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా మళ్లీ అదే కోర్టులో ఉత్తర్వులు అందుకున్నారు. బోయినపల్లి 2021 నుంచి సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. జిల్లా జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్, ఉద్యోగులు రవికి శుభాకాంక్షలు తెలిపారు.

ముద్దునూరు హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించిన బృందం

వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న సభ్యులు

తల్లాడ, డిసెంబర్ 27 : ముద్దునూరు హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాన్ని కేంద్ర నేషనల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ టీం సభ్యులు టీం సభ్యులు అఖిలా అన్వారి, సునీతకుమార్, శ్రీవాత్సవ్‌లు హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా అందించే సేవలను బుధవారం సందర్శించి రిజిష్టర్లు, పరికరాలు పరిశీలించారు. హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందించే సేవల గురించి స్థానిక ప్రజలను, ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు రత్నమనోహర్, జిల్లా క్వాలిటీ మేనేజర్ ఉపేంద్ర, పల్లెదవాఖాన వైద్యులు శ్రీకాంత్, మహేశ్వరరావు, హెల్త్‌సూపర్‌వైజర్స్ భాస్కర్, పెద్దపుల్లయ్య, మేరమ్మ, భద్రమ్మ, వసంతకుమారి, త్రివేణి, కుమారి, రాజశ్రీ, ఏఎన్‌ఎంలు జయకుమారి, సుజాత, ఎల్‌టీ కృష్ణ, సురేశ్, రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న పోటు రంగారావు

చింతకాని, డిసెంబర్ 27 : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. నాగులవంచ గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశల్లో అనేక మంది పోరాటాలు చేస్తూ కేసుల్లో ఉన్నారని, వారికి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేసి సమస్యల సాధనకు కృషిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు ఆవుల అశోక్, బీ వెంకటేశ్, కోలేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, రవికుమార్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ రుద్రాక్ష మల్లేశం బదిలీ

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 28: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్ష మల్లేశం బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఇటీవల జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన వ్యవసాయ మార్కెట్లయిన వరంగల్, సూర్యాపేట, హుజూర్‌నగర్, ఖమ్మం ఏఎంసీల సెక్రటేలను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు సెక్రటరీ డిప్యూటేషన్‌లో కొనసాగుతున్నారు. వీరందరినీ తిరిగి వారి పూర్వ మార్కెట్లకు బదిలీ చేశారు. అందులో భాగంగానే ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ మల్లేశం బదిలీ అయ్యారు. గతంలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన మల్లేశం మూడేళ్ల క్రితం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బదిలీపై వచ్చారు. దీంతో తిరిగి మల్లేశం హుజూర్‌నగర్ మార్కెట్ సెక్రటరీగా ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- పంచాయతీల్లో హెల్ప్‌డెస్కుల ఏర్పాటు
- ప్రభుత్వ దరఖాస్తులోనే వివరాలు సమర్పించాలి
- అవగాహన సదస్సుల్లో ఎమ్మెల్యేలు, ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు

వేంసూరు : మాట్లాడుతున్న ఆర్డీవో అశోక్‌చక్రవర్తి

బోనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గణేశ్

నమస్తే, న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 27 : ఖమ్మం జిల్లాలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి నిర్వహించే ప్రజాపాలన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుధవారం జరిగిన అవగాహన సదస్సుల్లో ఎమ్మెల్యేలు, ఆర్డీవోలు, ప్రతేకాధికారులు ప్రజలకు సూచించారు. బుధవారం ఆయాగ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. ఈ నెల 28నుంచి వచ్చే నెల 6వ తేదీవరకు గ్రామసభలు జరుగుతాయన్నారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించి ఒకే దరఖాస్తు ఉంటుందని, వాటిని ఇంటింటికీ తెరిగి అధికారులు అందిస్తారని తెలిపారు. వాటిని పూర్తిచేసి సంబంధిత జిరాక్స్ కాపీలను జతపరిచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందించాలన్నారు. ప్రతీ గ్రామంలో రెండు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో టీం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అనంతరం మరో గ్రామంలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దళారులను ఆశ్రయించవద్దన్నారు. ఖమ్మం రూరల్‌లో ప్రత్యేకాధికారి రాజేశ్వరీ, ఎంపీపీ బెల్లం ఉమా, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కూసుమంచిలో స్పెషల్ ఆఫీసర్ డీఎస్‌వో గంటా శ్రీలత, ఎంపీడీవో ఆర్ రమాదేవి ప్రజలకు అవగాహన కల్పించారు. కల్లూరులో ఎంపీడీవో రవికుమార్ , మండల ప్రత్యేక అధికారి పి.సునీత, తహసీల్దార్ సాంబశివుడు, కారేపల్లిలో ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు. పెనుబల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రభుత్వం అందించే దరఖాస్తులు మాత్రమే ప్రజల నుంచి స్వీకరించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, స్పెషల్‌ఆఫీసర్ బీ.శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్ పాల్గొన్నారు. సత్తుపల్లింలో మండల ప్రత్యేకాధికారి సునీల్‌రెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమావతి, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీవో జయరాం, సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఆర్డీవో అశోకచక్రవర్తి, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ సుజాత అవగాహన కల్పించారు. తల్లాడలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, తహసీల్దార్ వీ.రవికుమార్, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, వేంసూరు మండలంలో కల్లూరు ఆర్డీవో అశోక్‌చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ రాజు, వైరాలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, మండల నోడల్ అధికారి కస్తాల సత్యనారాయణ, బోనకల్లులో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీ.గణేశ్, జడ్పీటీసీ మోదుగుల సుధీర్‌బాబు, తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీవో జీ.అశోక్, చింతకానిలో శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవో జీ గణేశ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేశ్ అవగాహన సదస్సులు నిర్వహించారు. ముదిగొండలో ఎంపీడీవో అశోక్ , ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, తహసీల్దార్ వైరా మారావు, మధిరలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. వైరాలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎర్రుపాలెంలో మండల స్పెషల్ ఆఫీసర్ వేణుమనోహర్, ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పీటీసీ శీలం కవిత ప్రజలకు ఆరు గ్యారెంటీలపై, గ్రామసభలపై అవగాహన కల్పించారు. రఘునాథపాలెం మండలంలో మండల ప్రత్యేకాధికారి విజయకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు మాళోతు ప్రియాంక, గౌరి, గుత్తా రవి, మాదంశెట్టి హరిప్రసాద్, హన్మంతరావు, శ్యాం, భాస్కర్‌రావు, శ్రీనివాస్, విశ్వనాథం, చిరంజీవి, శ్రీనివాసరావు సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు.

మధిర : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత

తల్లాడ: మాట్లాడుతున్న ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు

రఘునాథపాలెం: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి విజయకుమారి

ఖమ్మం రూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లం ఉమా

కూసుమంచి : మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ డీఎస్‌వో గంటా శ్రీలత

ఎర్రుపాలెం : మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

క్రికెట్ విజేతలకు డాక్టర్ కూరపాటి అభినందన

ఖమ్మం సిటీ, డిసెంబర్ 27: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నాలుగు రోజులుగా పటేల్ వర్సెస్, అకాడమీ ఫర్ క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ మధ్య క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిల్లో ఏసీఎల్ జట్టుపై ఖమ్మం టీం ఘన విజయం సాధించింది. అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఖమ్మం జట్టును ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు పటేల్ స్టేడియంలో బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు ఎండీ మతీన్, విజయ్, ఎల్లయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 27: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో భాగంగా జిల్లాలో బుధవారం ఇద్దరు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడ్డారు. ఇన్విజిలేటర్లు వీరిని గుర్తించి ఫిర్యాదు చేయడంతో వారిపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ పీ.మల్లారెడ్డి తెలిపారు.

కేసీఆర్ నీడలో నడుస్తా .. మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరాటౌన్, డిసెంబర్ 27 : ఎన్ని అవాంతరాలు వచ్చినా కేసీఆర్ నీడలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే వైరా నియోజకవర్గ ఇంచార్జి బానోతు మదన్‌లాల్ అన్నారు. బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి అధ్యక్షతన బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితమని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలు తద్వారా స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా మన పార్టీ సత్తా చూపించాలని ఎవరూ అధైర్యపడవద్దని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ కలెక్టరేట్‌లో వినతి

కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందిస్తున్న ఆటో కార్మికులు

మామిళ్లగూడెం, డిసెంబర్ 27: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డు పాలై ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికులను ఆదుకోవాలని బీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఆటో కార్మికులతో కలిసి సంఘం నాయకులు గురువారం ఐడీవోసీలో కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఆటో కార్మికుడు రోజు రూ.1,000 వరకు నష్టపోతున్నాడని, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల రోజుకు రూ.300 కూడా ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలన్న బీఆర్‌టీయూ – టీఏటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం ఆటో కార్మికులమంతా కలిసి బుధవారం ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో వినతిప్రతం అందించామన్నారు. ఆటో కార్మిక కుటుంబానికి ప్రతి నెలా రూ.15 వేలు అందించాలని, ఫైనాన్స్‌లో తీసుకున్న ఆటోల రుణాన్ని ప్రభుత్వమే భరించాలని కోరారు. సంఘం నాయకులు పాల్వంచ కృష్ణ, ఎండీ వై పాషా, ఉమా మహేశ్వరరావు, వేమా సిల్వారాజ్, జానిమియా, మైసా ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, గుంటి శ్రీను, రాంబాబు, కుక్కల రామకృష్ణ, ముల్లార్, అబ్దుల్, సలీం, సాయిబాబా, పాషా, మస్తాన్, గోపయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

కూసుమంచి, డిసెంబర్ 27: ప్రజాపాలన గ్రామ సభలు గురువారం నుంచి నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఆర్ రమాదేవి తెలిపారు. గురువారం మండలంలోని లాల్‌సింగ్ తండా, సంద్యాతండా, జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, లింగారంతండా, గంగబండతండాల్లో గ్రామ సభలు నిర్వహిస్తునామని, అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బోనకల్‌లో..

బోనకల్లు, డిసెంబర్27 : ప్రజాపాలన గ్రామసభలు గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు జరుగుతాయని మండల టీం లీడర్ పున్నం చందర్, జీ.అశోక్ బుధవారం తెలిపారు. 28న రామాపురం, నారాయణపురం, 29న సీతానాగారం, రాపల్లె, గార్లపాడు, పెద్దబీరవల్లి, 30న బోనకల్లు, ముష్టికుంట్ల, చిరునోముల, చొప్పకట్లపాలెం, జనవరి 2న చిన్నబీరవల్లి, గోవిందాపురం–ఎల్, జానకీపురం, 3న రాయన్నపేట, మోటమర్రి, బ్రాహ్మణపల్లి, కలకోట, 4న తూటికుంట్ల, ఆళ్లపాడులో జరుగుతాయని తెలిపారు.

30న క్రీడాపోటీలు

కల్లూరు, డిసెంబర్ 27 : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఈనెల 30న కల్లూరులోని మినీస్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో దామోదర ప్రసాద్ బుధవారం తెలిపారు. పరుగుపం దెం, లాంగ్‌జంప్, హైజంప్ అంశాల్లో ఈ క్రీడా పోటీలు ఉంటాయని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడల నిర్వహణ కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య, క్రీడల కన్వీనర్ పత్తిపాటి నివేదిత, వాయ్యామ ఉపాధ్యాయుల సహకారంతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లివింగ్‌స్టన్

బోనకల్లు, డిసెంబర్ 27 : టీఎస్‌యూటీఎఫ్ బీసీ గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర నూతన కమిటీను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావా రవి హైదరాబాద్‌లో ఎంపిక చేశారు. ఈ ఎంపికలో బోనకల్లు మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జీ.లివింగ్‌స్టన్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

ఎన్నికల వీడియో గ్రాఫర్లకు నిధులు మంజూరు చేయాలి

మధిర, డిసెంబర్ 27 : ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడియో గ్రాఫర్లకు నిధులను వెంటనే అందించాలని ఆర్డీవో జీ.గణేశ్‌కు వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ బాధ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో వీడియో గ్రాఫర్లు ఎన్నికల విధులు నిర్వహించారని, ఇంత వరకు ఆ డబ్బులను అందించకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

పేరు మార్పు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం, రామచంద్రాపురం కాలనీ పంచాయతీకి చెందిన **కుమ్మరికుంట్ల వీరభద్రం**, వయస్సు : 48, తండ్రి :కుమ్మరికుంట్ల ముత్తయ్య అను నేను నా యొక్క పేరును **కుమ్మరికుంట్ల భద్రయ్య** గా మార్చుకొనుచున్నాను. ది.14 డిసెంబర్ 2023న నోటరీ లాయర్ నర్మద భద్రాచలం గారి వద్ద పేరు మార్పు కొరకు నోటరీ చేయించడం జరిగినది. పేరు మార్పుపై ఏలాంటి ఫిర్యాదులు అందిన దానికి నేనే బాధ్యత వహిస్తానని తెలియజేయుచున్నాను.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు త్రివేణి విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 27: నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–14 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రతిభచాటి నేషనల్స్‌కు ఎంపికైన పాఠశాల విద్యార్థులు వినయ్, విశ్వతేజలను స్కూల్ డైరెక్టర్ వీరేంద్రచౌదరి, కృష్ణవేణి – త్రివేణి విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కుటుంబం యూనిట్‌గా దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం, డిసెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజాపాలన గ్రామసభల దరఖాస్తులను కుటుంబం యూనిట్‌గా స్వీకరించనున్నట్లు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని, డివిజన్ల వారీగా తేదీలను ఖరారు చేసి బృందాలను నియమించామని అన్నారు. కుటుంబంలో ఎంతమంది ఉన్నా ఆ కుటుంబాన్ని యూనిట్ తీసుకొని యజమాని పేరుమీదనే దరఖాస్తు స్వీకరిస్తామని అన్నారు. దరఖాస్తులను కుటుంబాలకు పంపిణీ చేస్తామని, 28, 29 తేదీల్లో సభలు ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే దరఖాస్తులు పంపిణీ పూర్తి చేశామని అన్నారు. మరో రెండు రోజుల్లో అన్ని డివిజన్ల లోనూ దరఖాస్తుల పంపిణీ పూర్తవుతుందన్నారు. ఇంటి వద్ద దరఖాస్తు అందుకోలేకపోయిన వారి కోసం సభల వద్ద ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచుతామన్నారు. కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, ఎవరైనా తమ డివిజన్లలో బృందాలకు దరఖాస్తులను అందజేయలేకపోతే వారి కోసం కేఎంసీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సభలు ముగిసే వరకు టీమ్ లీడర్ ఆయా డివిజన్ వాసులకు అందుబాటులో ఉంటారని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల్లో వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేశామని, దరఖాస్తు స్వీకరించిన తర్వాత టీమ్ లీడర్ సంతకం చేసిన రసీదును దరఖాస్తుదారుడికి అందజేస్తారని తెలిపారు. దరఖాస్తుకు లబ్ధిదారులు రేషన్ కార్డు జిరాక్స్, యజమాని ఆధార్ జిరాక్స్, యజమాని ఫొటో తప్పనిసరిగా జత చేయాలని కమిషనర్ సూచించారు. రేషన్ కార్డు లేని వారి దరఖాస్తులు కూడా స్వీకరిస్తామని అన్నారు. ఇంది రమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి అమరవీరులు, తెలంగాణ ఉద్యమకారుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వివరించారు. ఈ నెల 31, జనవరి 1 తేదీలు సెలవు దినాలు కాబట్టి ఆ రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం ఉండదని అన్నారు.

ఫ్యామిలీలో ఎంతమంది ఉన్నా యజమాని పేరు మీదనే దరఖాస్తు

నిర్ణీత డివిజన్లలో దరఖాస్తుల పంపిణీ పూర్తి: కేఎంసీ కమిషనర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వైరా టౌన్, డిసెంబర్ 27: వైరాలోని తల్లాడ రోడ్డులో ఓ దాబా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మల్యాల హనుమంతరావు తన మిత్రుడిని తల్లాడలో దింపేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఇదే సమయంలో వైరా సమీపంలో దాబా వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ అతడి బైకును ఢీకొనడంతో హనుమంతరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని వైరా ఎస్సై మేడా ప్రసాద్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీ బ్యాంకు డ్రైవర్ మృతికి సంతాపం

నివాళులర్పిస్తున్న కూరాకుల

తల్లాడ, డిసెంబర్27 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన విజయ్ కొణిజర్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం విజయ్ మృతదేహాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితో పాటు బ్యాంకు సీఈవో రెహమాన్, కుర్నవల్లి సంఘ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, మండల నాయకులు తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

మదన్‌లాల్ పరామర్శ

నివాళులర్పిస్తున్న మదన్‌లాల్

వైరాటౌన్, డిసెంబర్ 27 : వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్